క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మండలంలోని టి.బరంపురం పంచాయతీ కె.శాసనాం అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు పోషకాహార పదార్థాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పోషన్ కిట్లను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌యూసీ సభ్యుడిగా సూర్యప్రకాష్



ఇచ్ఛాపురం: డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సలేటివ్ కమిటీ (డీఆర్‌యూసీ) ఖుర్దా డివిజన్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే సభ్యునిగా పట్టణానికి చెందిన కట్టా సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం డీఆర్ఎం ఖుర్దా డివిజన్ వారి నుంచి సమాచారం వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రైల్వే యూజర్ కమిటీ సభ్యునిగా ఉన్న తనను, డీఆర్‌యూసీ సభ్యునిగా నియమించినందుకు ఖుర్దా డీఆర్ఎం హెచ్ఎస్ బజ్వా, భువనేశ్వర్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫన్కవాల్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఒడియా మాధ్యమం కొనసాగించాలి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ ప్రతినిధులు

కంచిలి: రాష్ట్రంలో ఒడియా మాధ్యమాన్ని కొనసాగించాలని ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ పాఢి, బృందావన్ దొళాయిలు కోరారు. మండల కేంద్రం కంచిలి రాధాకృష్ణ ఆలయం ఆవరణలో ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఒడియా ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగించి, అవసరమైన ఉపాధ్యాయులను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కంచిలి మండల శాఖ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పాఢి, కార్యదర్శి భాగీరథి నాయక్, ఉపాధ్యక్షుడు త్రినాథ్ సాహు, గోపబంధు గౌడ, శరత్‌చంద్ర బెహరా, సురేష్ పండా, నయన పండా, జనార్ధన పాణిగ్రాహి, ప్రదీప్ మండల్, ప్రశాంత్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు నిలుపుదల చేయాలి

సోంపేట: మండలంలోని బారువ రైల్వేస్టేషన్‌లో పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని బారువ రైలు నిలుపుదల సాధన కమిటీ ప్రతినిధులు కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్రమంత్రులు కింజిరాపు రామ్మోహన్‌నాయుడు, అశ్విని వైష్ణవ్‌లను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు.

సర్పంచ్‌లకు గౌరవం లేదు



మాట్లాడుతున్న ఎంపీపీ ఉంగ ప్రవీణ

పలాస: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తరుచుగా ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మదిరంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో సర్పంచ్‌లను భాగస్వాములు చేయడం లేదని మండిపడ్డారు. సర్పంచ్‌లకు కనీస గౌరవం ఇవ్వకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు సహకరిస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం శిలా ఫలకాల మీద పేర్లు కూడా వేయడం లేదని, ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ తాము చూడలేదన్నారు. ఇలా అయితే పంచాయతీ తీర్మానాలను ఆమోదించకుండా అడ్డుకుంటామని బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల పాపారావు హెచ్చరించారు. ఎంపీడీవో వసంతకుమార్ మాట్లాడుతూ సభ్యుల మనోభావాలు అర్థం చేసుకున్నానని, ఇక నుంచి అటువంటివి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు, నీటి సంఘాల ఎన్నికల్లో బిజీగా ఉన్నామని, సభ్యుల సమస్యలను ఒక్కొక్కటిగా త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, సర్పంచ్‌లు కొర్ల శిరీష, దువ్వాడ వామాక్షి, ఎంపీటీసీలు బమ్మిడి దుర్యోధనరావు, తలగాన శ్రీరాములు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శంకరరావు, ఎలక్ట్రికల్ ఏఈ దేవేంద్ర పాల్గొన్నారు.

గొంతెండుతోంది..!

- నెల రోజులుగా తాగునీటి సరఫరా బంద్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



ఖాళీ బిందెలు చూపిస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) సరఫరా లేక నిరుపయోగంగా మారిన కుళాయి

సోంపేట: నెల రోజులుగా సోంపేట మండలంలోని ప్రజల గొంతెండుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వం అందించే కుళాయి నీరే బారువ, సోంపేట, బెంకిలి, జింకిభద్ర, కొర్లాం, పలాసపురం, బేసిరామచంద్రాపురం తదితర పంచాయతీలకు ఆధారం. దీనికోసం ఉద్దానం ప్రాజెక్టు, గత ప్రభుత్వం జలజీవన్ మిషన్‌లో భాగంగా హిరమండలం వద్ద ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ద్వారా సరఫరా అవుతున్న నీటిపైనే ఇక్కడి ప్రజలు ఆధారపడుతున్నారు. అయితే నెల రోజులుగా పైపులైన్ల మరమ్మతుల పేరిట అధికారులు తాగునీరు సరఫరా చేయడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేదని, మరమ్మతులు చేపట్టినా వారం రోజుల్లో పనులు పూర్తి చేసి సరఫరా చేసేవారని గుర్తు చేసుకుంటున్నారు.

చర్యలు శూన్యం

మండలంలోని దాదాపు 70 వేల మంది ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గతంలో ఇలాంటి ఇబ్బందులు తలెత్తేటప్పుడు ట్యాంకులు ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసేవారు. కానీ ప్రస్తుతం అటువంటి పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అసలు సమస్య కోసం ఎవరూ మాట్లాడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్దానం ప్రాజెక్టుపై నీలినీడలు

సుమారు 30 ఏళ్ల క్రితం ఉద్దానం ప్రాజెక్టును ప్రారంభించారు. గత ప్రభుత్వ హయంలో ఈ ప్రాజెక్టు అభివృద్ధికి పాలకులు విశేషంగా కృషి చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఉద్దానం ప్రాజెక్టు నిర్వహణ కూడా గాలికి వదిలివేసిందని తెలుస్తోంది. జలజీవన్ మిషన్ నీరు రాకపోయినా ఉద్దానం ప్రాజెక్టు ద్వారా నీరు సరఫరా అయ్యేది. ప్రస్తుతం ఉద్దానం ప్రాజెక్టుకు కూడా పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణ లోపభూయిష్టంగా తయార్యయింది. దీంతో గ్రామాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయి.

సరఫరాకు చర్యలు

హిరమండల వద్ద పైపులైను మరమ్మతులకు గురయ్యింది. మరమ్మతులు చేపట్టినా హిరమండలం నుంచి వచ్చే పైపులైన్లు లీకేజు అవుతున్నాయి. వేగంగా సమస్య పరిష్కరించి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– జగన్మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఇచ్ఛాపురం

మినరల్ వాటర్ కొంటున్నాం



గ్రామంలో నెల రోజులుగా తాగునీటి సరఫరా జరగడం లేదు. దీంతో రూ.20లు చెల్లించి గ్రామానికి వస్తున్న మినరల్ వాటర్‌ను కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి తక్షణమే తాగునీరు సరఫరా చేయాలి.

– టి.అన్నపూర్ణ, జింకిభద్ర, సోంపేట మండలం

బోరునీరు తాగలేం



జింకిభద్ర గ్రామంలో బోర్లు నుంచి వచ్చే నీరు చప్పగా ఉంటుంది. దీంతో తాగడానికి వంటలు చేసుకోవడానికి ఆ నీరు ఉపయోగపడదు. ప్రభుత్వం కుళాయిలు ద్వారా సరఫరా చేసే నీరే తాగడానికి ఆధారం. కానీ ప్రస్తుతం నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– టి.రూపావతి, జింకిభద్ర, సోంపేట మండలం

సరఫరా చేయకపోవడం దారుణం



సోంపేట మండలంలో చాలా గ్రామాలకు తాగునీరు నెల రోజులుగా సరఫరా కావడం లేదు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం దారుణం. తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకొని ఇబ్బందులు పరిష్కరించాలి.

– సాహుకారి జయలక్ష్మి, జింకిభద్ర, సోంపేట మండలం

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

- సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు అవసరం
- కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

కంచిలి: ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు స్పష్టం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో శనివారం మాట్లాడారు. పోలీసులైనా, మీడియా అయినా నిబంధనలను పాటించాల్సిందేనన్నారు. సోషల్ మీడియాలో విమర్శలు, ఆరోపణలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఇటువంటి వాటికి భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని హితవు పలికారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఎవరికీ మినహాయింపు ఉండదన్నారు. డిజిటల్ మీడియా ప్రభావం పెరగడంతో ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారని, అయితే కొందరు దీన్ని దురివినియోగం చేస్తూ కష్టాల్లో పడుతున్నారని పేర్కొన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం అంటే ప్రమాదాలు కొనితెచ్చుకోవడమేనని హెచ్చరించారు. వ్యక్తిగతంగా ఎవర్నీ టార్గెట్ చేయవద్దని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

యువత గంజాయి వంటి మత్త పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి రవాణా, అమ్మకం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మధ్యకాలంలో కాశీబుగ్గ డివిజన్ పరిధిలో గంజాయి కేసులను విరివిగా నమోదు చేసి, బాధ్యులను అరెస్టులు చేస్తున్నామని తెలియజేశారు.

పశువుల రవాణాపై ఉక్కుపాదం

పశువుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామని, ఇటువంటి కార్యకలాపాలకు తావులేకుండా పటిష్ట నిఘా పెట్టామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మూగజీవాలను కిక్కిరిసి రవాణా చేసినా తప్పేనని, అటువంటి వాటిపైన కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించి ప్రయాణించడం వలన ద్విచక్రవాహనదారులు రక్షణ పొందుతారన్నారు.

దాబాల్లో మద్యానికి అనుమతి లేదు

దాబా హోటళ్లలో మద్యం అమ్మకాలకు ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అటువంటి పరిస్థితులు ఎక్కడున్నా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దాబాలు కేంద్రాలుగా కొన్ని అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు మీడియా ప్రతినిధులు డీఎస్పీ దృష్టికి తీసుకురావడంతో, వాటిపై నిఘా పెట్టాల్సిందిగా స్థానిక పోలీసులను ఆదేశించారు. సమావేశంలో సోంపేట సీఐ బి.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్...

పైపులైన్ల మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

టెక్కలి రూరల్: స్థానిక బ్రహ్మణ వీధి సమీపంలోని రహదారి మధ్యగా ఉన్న పైపులైన్లు మరమ్మతులకు గురవ్వడంతో తాగునీరు వృథాగా పోతోందని ఇటీవల 'తాగునీరు వృథా' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ రామకృష్ణ, ఏఈ మోహన్ పర్యవేక్షణలో శుక్రవారం రాత్రి పైపులైన్ల మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి బస్టాండ్ సమీపంలోని ఫిష్ మార్కెట్ వెనుక భాగంలో మున్సిపల్ డ్రైనేజీ, రోడ్లను ఆక్రమించి నిర్మించిన అదనపు నిర్మాణాలను శనివారం మున్సిపల్ అధికారులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావుకు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆక్రమణలు తొలగించారు. కమిషనర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

మురళీ కుమార్‌కు సన్మానం

కాశీబుగ్గ: ఉద్దానం రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం పలాస మండలం మానకపల్లి గ్రామంలో జరిగిన సాహితీ కార్యక్రమంలో వర్ధమాన కవి, రచయిత సాలిన మురళీ కుమార్‌కు ఉద్దానం రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక స్పృహతో రచనలు రాస్తున్న సాలిని మురళీ కుమార్‌ను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కవి, రచయిత వినోద్ కుత్తుం, మల్లేన అశోక్‌కుమార్, బత్తిని వినోద్, ఉపాధ్యాయులు కుత్తుం సుధాకర్, కుత్తుం ప్రసాద్, కొయిల కోటేశ్వరరావు, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

వజ్రపుకొత్తూరు/రూరల్: మండలంలోని కొండవూరు గ్రామానికి చెందిన చలపాకుల పాపారావు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంతో మృతి చెందాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మైటీ హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు మృతుడి కుటుంబానికి రూ.12500లు ఆర్థిక సాయం శనివారం అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు కోటిపల్లి రాకేష్, కో–ఆర్డినేటర్ రాజేష్, అశిష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు చిత్తు కావద్దు



సన్యాసిపుట్టుగలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: యువత మత్తుకు చిత్తు కాకుండా ఉండాలని రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా శనివారం సన్యాసిపుట్టుగలో స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు డ్రైవింగ్ చేసే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు.


ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు



టెక్కలి: ఎన్నికలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి



కాశీబుగ్గ: చిరంజీవులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు



కంచిలి: కర్తలిలో ఎన్నికలు జరుగుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ముగిశాయి. ఎక్కడ కూడా అధికారులు స్వేచ్ఛగా ఎన్నికలు జరగడానికి తగిన అవకాశాలు కల్పించ లేదు. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ఏకపక్షంగా నిర్వహించారని పలువురు పేర్కొన్నారు. ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించగా, కొన్నిచోట్ల టీడీపీ, జనసేన నుంచి అభ్యర్థులు పోటీ పడ్డారు. అనంతరం ఎన్నికైనవారికి అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్

ఆధార్ అవస్థలు



డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ కేంద్రంలో సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. టెక్కలి పరిసర ప్రాంతాల వినియోగదారులకు ఆసరాగా ఉన్నటువంటి ఈ కేంద్రంలో సుమారు వారం రోజులుగా సేవలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులతో పాటు ఆధార్ అవసరాలు కలిగిన వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆధార్ సేవలు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

– టెక్కలి

ఆర్థిక సాయం



సంతబొమ్మాళి మండలం బడే కుప్పన్నపేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ సభ్యులు పలువురికి ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. వడ్డితాండ్ర గ్రామానికి చెందిన పెరాలసిస్ రోగి నెయ్యిల జయరాంకు రూ.8 వేలు, నరసింగపల్లి గ్రామానికి చెందిన ఇటీవల భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలు కలిగి దిక్కుతోచని స్థితిలో ఉన్న మోద దమయంతికి రూ.2 వేలు, నిత్యావసర వస్తువుల కిట్స్, సంతబొమ్మాళికి చెందిన దివ్యాంగురాలు అకోల లక్ష్మి, డయాలసిస్ రోగి కొన్న చిన్నారావులకు 25 కిలోల బియ్యం, 35 రకాల నిత్యావసర వస్తువుల కిట్స్, చర్మవ్యాధిగ్రస్తులు సహదేవ్‌కి రూ.1500 విలువ చేసే నెలవారీ మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు షణ్ముఖరావు, నర్సాపురం సర్పంచ్ దుక్క భూషణరెడ్డి, శివారెడ్డి, సింహాచలం, ప్రసాద్, ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి

కన్నెపూజ



ఇచ్ఛాపురం పట్టణంలోని అయ్యప్పస్వామి సన్నిధానంలో కన్నెపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. మూర్తి గురుస్వామి అధ్వర్యంలో మొదటిసారిగా అయ్యప్ప మాలధారణ చేసిన 50 మంది కన్నెస్వాములతో కన్నెపూజా కార్యక్రమం అర్చకులు గణేష్ ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు కృష్ణారెడ్డి, ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం

రాజీయే రాజమార్గం



సోంపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి శ్రీనివాసరావు



ఇచ్ఛాపురం: కేసులను పరిష్కరిస్తున్న జడ్జి పరేష్‌కుమార్



టెక్కలి: కోర్టు సముదాయంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జిలు, న్యాయవాదులు

టెక్కలి: సాధారణ కేసుల్లో రాజీయే రాజమార్గమని ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తిలు అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం వేర్వేరుగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 232 కేసులను పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో సభ్యులు బి.కృష్ణమూర్తి, పి.బాబురావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: లోక్ అదాలత్ ద్వారా 208 కేసులకు జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ పరిష్కారం చూపారు. శనివారం కోర్టు ఆవరణంలో లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు రమణయ్య, బార్ అసోసియేషన్ సభ్యులు నాగరాజు పాత్రో, సీతయ్య, దేవరాజ్, భగవాన్‌దాస్, సత్యన్నారాయణపాఢీ, మనోజ్, బైరాగి, రంగారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలోని కోర్టుల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 96 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు తెలియజేశారు. కోర్టుల సముదాయంలో జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాముతో కలిసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు సర్వేశ్వరరావు, న్యాయవాదులు డి.నందగోపాల్, విజయ్ కుమార్, జోగారావు, కె.వెంకటేశ్వరరావు, పున్నయ్య, ఎస్.వి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు



చిట్టి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న పేరాడ తిలక్ తదితరులు



బడ్డిపేటలో పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ

టెక్కలి: కోటబొమ్మాళి మండలం సరియాబొడ్డపాడు, బడ్డిపేట, గోదావరిపేట, బిర్లంగి, పాడుగుపాడు, చిన్నహరిశ్చంద్రపురం తదితర గ్రామాల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శనివారం పలు కుటుంబాలను పరామర్శించారు. పలువురు బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు నాయకులు ఎస్.సత్యరాజ్, కృష్ణమూర్తి, వాసు, జి.కేశవరావు, పి.సత్యం, దివాకర్, శాంతారావు, డిల్లీ, మోహన్, అమ్మినాయుడు, సోమేష్, ఎస్.మోహన్, యు.విశ్వనాథం తదితరులు ఉన్నారు.

టెక్కలి: నియోజకవర్గంలోని టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. టెక్కలి మండలం బూరగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ చిట్టి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కోటబొమ్మాళి మండలం జగన్నాథపురం పంచాయతీ రామకృష్ణాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యుడు మెట్ట చంద్రరావు తండ్రి మల్లేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, కార్యకర్తలు జె.యర్రన్నరెడ్డి, జె.తిరుమల రెడ్డి, పోలాకి మోహన్, బి.హనుమంతురావు, పి.లచ్చయ్య, వీరన్న, నూక సత్యరాజ్, కూన కృష్ణమూర్తి, మూల చంద్రబాబు, మెట్ట అప్పలనాయుడు, దంపల వెంకన్న, ఆవాల పోలినాయుడు తదితరులు ఉన్నారు.

నందిగాం: మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పేరాడ తిలక్ పరామర్శించారు. గొల్లూరు పంచాయతీ గోకర్లపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రట్టి నాగరాజు తల్లి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను, పాత్రునివలసకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ తుంగాన చైతన్య మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కలిశారు. ఆయనతో పాటు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మాజీ ఎంపీపీ యర్ర చక్రవర్తి, పోలాకి మోహనరావు పోలాకి చిరంజీవులు, వీరన్న, తారకేశ్వరరావు తదితరులు ఉన్నారు.